# మున్సిపాలిటీని విముక్తి చేయడమే లక్ష్యం

**● ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు**



**ప్రజానావ, కాగజ్‌నగర్:** బీఆర్ఎస్ కబంధహస్తాల నుంచి కాగజ్‌నగర్ మున్సిపాలిటీని విముక్తి చేయడమే తమ లక్ష్యమని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పరోక్ష ఎన్నికల సందర్భంగా ఒకే లక్ష్యంతో పనిచేశానని తెలిపారు. మున్సిపాలిటీని విముక్తి చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ అభ్యర్థికి తాను ఓటు వేసినట్లు వెల్లడించారు. తాను అడ్డుగోడలా నిలవకపోతే మున్సిపాలిటీ మళ్లీ బీఆర్ఎస్ చేతుల్లోకి వెళ్లి గతంలో జరిగిన అరాచకాలు, కబ్జాలు పునరావృతయ్యేవని అన్నారు. పార్టీ, వ్యక్తి, మత భేదాలు చూడకుండా పట్టణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు. చైర్మన్‌గా కాంగ్రెస్ అభ్యర్థి, వైస్ చైర్మన్‌గా బీజేపీ అభ్యర్థి గెలవడంతో బీఆర్ఎస్‌కు మున్సిపాలిటీలో పూర్తిగా అవకాశం లేకుండా చేశామన్నారు. గత ఎన్నికల్లో 22 సీట్లు గెలిచిన బీఆర్ఎస్ ఈసారి 11సీట్లకే పరిమితమవ్వడం ప్రజల తీర్పుకే నిదర్శనమన్నారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వైస్ చైర్మన్ విషయంలో పార్టీని చూడలేదని చెప్పారని, తాను అదే ఒరవడిలో భాగంగా చైర్మన్ అభ్యర్థి విషయంలో పార్టీని చూడలేదన్నారు. బాజాప్త తాను చెయ్యి ఎత్తి ఓటు వేసిన విషయాన్ని ప్రజలందరూ గమనించారని, లోపాయికారి ఒప్పందం చేసుకోవాల్సిన అవసరం తనకు ఏమాత్రం లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పొత్తుతో ఎన్నో మున్సిపాలిటీలను చేజెక్కించుకున్నారని, అలాగే బీఆర్ఎస్, ఎంఐఎం పొత్తుతో కూడా చాలా మున్సిపాలిటీలను గెలిచారని తెలిపారు. ఎంఐఎం మద్దతుతో వైస్ చైర్మన్ గా ఎన్నికైన డాక్టర్ అనిత చేసిన ఆరోపణలను ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నానని పేర్కొన్నారు. హిందువులపై సవతి తల్లి ప్రేమ ఒలకబోస్తున్న కోనేరు కోనప్ప గతంలో ఎన్నడూ హిందువులకు అవకాశం ఇవ్వలేదని, ఇప్పుడు ఓడిపోయే పరిస్థితుల్లో ఒక హిందూ మహిళను చైర్మన్ గా ప్రోజెక్టు చేసి వారిని కూడా మోసం చేశారని విమర్శించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు విశ్వేశ్వరరావు, గజ్జల లావణ్య లక్ష్మణ్, మిట్టపల్లి కమల, మాజీ కౌన్సిలర్లు సిందం శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, బాల్కశ్యామ్, కోంద్ర మనోహర్ గౌడ్, ఎలములే మల్లన్న, నాయకులు చిలువేరు ప్రవీణ్, అరుణ్ లోయా, గొల్లపల్లి వీరభద్రాచారి, చిప్పకుర్తి శ్రీనివాస్, ఒడ్డేటి నాని, రాచర్ల మహేష్ యాదవ్, డోంగ్రే కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి రైతుల ఆందోళన



**ప్రజానావ, తాండూర్:** సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు పూర్తిస్థాయిలో చేపట్టడం లేదని ఆరోపిస్తూ తాండూర్ మండలం రేపల్లెవాడ గ్రామ సమీపంలోని జిన్నింగ్ మిల్లుల వద్ద జాతీయ రహదారిపై బుధవారం పత్తి రైతులు ఆందోళన చేపట్టారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి రైతులు తమ పత్తిని ట్రాలీలు, వ్యాన్లలో మిల్లుల వద్దకు తీసుకొచ్చినా అధికారులు నాణ్యత పేరిట కొనుగోళ్లు నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి గింజలకు పుచ్చు ఉందని, తేమ శాతం అధికంగా ఉందని, నాణ్యత సరైనది కాదని వివిధ కారణాలు చూపుతూ కొర్రీలు పెడుతున్నారని ఆరోపించారు. ఎంతో కష్టపడి పత్తిని తరలించిన తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, షరతులు లేకుండా పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 20వ తేదీతో కొనుగోళ్లు నిలిపివేస్తామని ప్రకటించడంతో జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తి లోడుతో వచ్చిన వాహనాలు పదుల సంఖ్యలో బారులు తీరాయి. సీసీఐ అధికారులు తిరస్కరించిన పత్తిని ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ రైతులను ఆర్థికంగా నష్టపరుస్తున్నారని రైతులు ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సీసీఐ ఇంచార్జ్ ఓబుల్ రెడ్డి స్పందిస్తూ రైతులు తీసుకొచ్చిన పత్తిలో చాలా వరకు పురుగు పట్టి ఉండటం, నాణ్యత లోపించడంతో సీసీఐ నిబంధనల మేరకే కొనుగోళ్లు చేస్తున్నామని తెలిపారు. నాణ్యమైన పత్తి వచ్చినపుడే కొనుగోలు సాధ్యమని స్పష్టం చేశారు. జాతీయ రహదారిపై రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న తాండూర్ ఏఎస్సై రాజమొగిలి సంఘటన స్థలానికి చేరుకుని రైతులు, సీసీఐ అధికారులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. అనంతరం ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

# వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత

**డిప్యూటీ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్**



**ప్రజానావ, జైనూర్:** అడవులు, వన్యప్రాణుల రక్షణ మనందరి బాధ్యత అని దబోలి సెక్షన్ డిప్యూటీ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. కెరమేరి అటవీక్షేత్ర అధికారి యోగేష్ కులకర్ణి ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని దబోలి గ్రామంలో గస్తీ నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ, వన్యప్రాణుల సంరక్షణపై ప్రజలకు వివరించారు. అడవి జంతువులను చంపేందుకు అక్రమంగా విద్యుత్ తీగలు వేయకూడదని, అడవులను అక్రమంగా నరికితే శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ చట్టాలను ఉల్లంఘించిన వారు ఎంతటివారైనా ఉపేక్షించబోమని, అవసరమైతే జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు. చట్టాలను గౌరవించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అటవీ బీట్ అధికారి దేవిదాస్, రాష్ట్ర మానవ హక్కుల కమిటీ ప్రధాన కార్యదర్శి గిరే సుధామ్, నాయకులు అశోక్, మారుతి, ఆనందరావు, భగవాన్, హరిదాస్, రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా సంత్ సేవలాల్ జయంతి



**ప్రజానావ, ఆదిలాబాద్:** జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో సంత్ సేవలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను అధికారికంగా ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంత్ సేవలాల్ మహారాజ్ బంజారా సమాజ అభ్యున్నతికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన బోధించిన సన్మార్గం, సమానత్వం, సామాజిక న్యాయం సూత్రాలు నేటి యువతకు మార్గదర్శకమని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతివర్గం ఐక్యంగా ముందుకు సాగి అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటిడిఎ పీఓ, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బంజారా సమాజ పెద్దలు, బంజారాలు పాల్గొన్నారు.

# భావి పౌరులే పాలకులు



**ప్రజానావ, తూప్రాన్:** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) బుధవారం సరికొత్తగా కనిపించింది. విద్యార్థులు ఒకరోజు పాలకుల అవతారమెత్తి తమ పరిపాలనా దక్షతను చాటుకున్నారు. ప్రధానాచార్యులు పట్లూరి లక్ష్మణ్ పర్యవేక్షణలో జరిగిన ఈ స్వయం పరిపాలన దినోత్సవం విద్యార్థుల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ ప్రభుత్వ హోదాల్లో మెరిశారు. ప్రధానోపాధ్యాయుడిగా హేమంత్ బాధ్యతలు చేపట్టగా.. జిల్లా విద్యాశాఖ అధికారిగా అద్విత విధులు నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా హారిక రమ్య, సహాయ మండల విద్యాశాఖ అధికారిగా సాయికుమార్, మండల విద్యాశాఖ అధికారిగా యోగేశ్వర్ బాధ్యతలు స్వీకరించి తమ పనితీరుతో అందరినీ ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులుగా గౌతమ్, నిఖిల్, అఖిల్, రితిక్ రెడ్డి, హర్షవర్ధన్, సిరూపణ, కృతిక, ప్రభావతి, అనుదీప్తి, స్నేహ మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.








# బాధిత కుటుంబాలకు చేయూత

**ప్రజానావ, కాగజ్‌నగర్:** డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ మండలంలోని భట్టుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 12వ వార్డు ఇంచార్జ్ చెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించి బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. లక్ష్మీనగర్ ప్రాంతంలో క్యాన్సర్ వ్యాధితో మృతిచెందిన కాసేట్టి తిరుపతి, ట్రాక్టర్ ప్రమాదంలో మరణించిన రమగోని లావణ్య, అలాగే అనారోగ్యంతో మృతిచెందిన రామిళ్ల రమేష్ కుటుంబాలను బుధవారం పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను చెట్టి వెంకటేష్ సొంత ఖర్చులతో అందజేశారు. బాధిత కుటుంబాలకు తోడుగా నిలవడం తమ సామాజిక బాధ్యతగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు వంగరీ ప్రవీణ్, మాజీ వార్డు సభ్యుడు అయిల్లా శంకర్, మొహమ్మద్ అక్రమ్, మొహమ్మద్ అప్పు, బొజ్జ తిరుపతి, పోగర్త సారయ్య, మొహమ్మద్ ఇమ్రాన్, ఎండి సాహిల్, లక్ష్మీనగర్ యూత్ సభ్యులు బెలుక వంశీ, అయిల్లా భార్గవ్, భట్టుపల్లి గ్రామ యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం



**ప్రజానావ, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ పట్టణంలోని గాంధీ చౌక్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా అగ్ని ప్రమాదం సంభవించి భారీ ఆస్తి నష్టం చోటుచేసుకుంది. ఈ ఘటనలో అయూబ్ ఖాన్ ఇల్లు పూర్తిగా దగ్ధం కాగా, ఇంటి పక్కన ఉన్న కార్ షెడ్ కూడా పూర్తిగా కాలిపోయింది. మంటలు వేగంగా వ్యాపించడంతో ఆస్తి నష్టం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే వార్డు కౌన్సిలర్ దారి కర్షణవిణి కుమారుడు, బీజేపీ నాయకుడు శేవా గౌడ్ ఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరు గురించి పోలీసుల ద్వారా వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అయూబ్ ఖాన్ కుటుంబానికి అన్నిరకాల సహాయం అందించడానికి కట్టుబడి ఉన్నట్లు హామీ ఇచ్చారు. బాధితులకు ప్రభుత్వం, స్థానిక సంస్థల ద్వారా సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# మాయమాటలతో మళ్లీ మోసమే..



**ప్రజానావ, తిర్యాణి:** గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు, ఎన్నికల కన్వీనర్ పులి వెంకటేష్ అన్నారు. సర్పంచ్‌లను గెలిపిస్తే ఐదు సంవత్సరాలు ఇంటి పన్ను మేమే చెల్లిస్తామని ఇచ్చిన హామీలు ఇప్పుడు అమలు కావడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన గ్రామపంచాయతీ ప్రతినిధులు ప్రస్తుతం ఇంటి పన్నులు చెల్లించాలంటూ ప్రజలను కోరుతున్నారని తెలిపారు. "ఎన్నికల సమయంలో మాట ఒకటి, గెలిచిన తర్వాత మాట ఒకటి" అనే పరిస్థితి ఏర్పడిందని, ఇచ్చిన హామీలు ఎప్పటి నుంచి అమలు చేస్తారో ప్రజలు ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఆరు గ్యారంటీలు, వందల హామీలు ఇచ్చిందని, వాటి అమలు పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. తిర్యాణి మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపించాలని సవాల్ విసిరారు. ప్రతి ఎన్నికల సమయంలో ప్రజలను మోసం చేయడం అలవాటుగా మారిందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

